ప్రజాశక్తి
గురువారం 11 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం



## బిఆర్ఎయు నూతన రిజిస్ట్రార్‌గా అడ్డయ్య

**ఎచ్చెర్ల :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా వర్శిటీ సీనియర్ అధ్యాపకులు బి.అడ్డయ్య నియమితులయ్యారు. వర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని నియామక ఉత్తర్వులను ఆయనకు బుధవారం అందజేశారు. ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలను నిర్వహించిన ఆచార్య పి.సుజాత నుంచి ఆయన బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అడ్డయ్య బిఆర్ఎయు రెక్టార్‌గా వ్యవహరించడమే కాకుండా పలుమార్లు వర్శిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా సేవలందించారు.



నియామక ఉత్తర్వులను అందజేస్తున్న విసి రజని

# ఈసారైనా ఎన్నికలు జరిగేనా?

- 2009 తర్వాత ఎన్నికలకు నోచని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్
- ప్రతిసారీ తెర పైకి ఏదో ఒక విలీనం సమస్య
- ఎమ్మెల్యేల రాజకీయ క్రీడతో ఎన్నికలు దూరం
- నష్టపోతున్న నగర పౌరులు



శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం

**స్థానిక సంస్థలకు మూడు నెలల ముందుగానే ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలపై రాజకీయ పార్టీలు, సామాన్య పౌరుల్లో సైతం చర్చ సాగుతోంది. ప్రతిసారి ఏదో ఒక విలీన సమస్య తెర పైకి వస్తుండడంతో, 2009 తర్వాత కార్పొరేషన్ ఎన్నికలకు నోచని పరిస్థితి నెలకొంది. చివరిసారిగా పాలకవర్గం ముగిసిన నాటి నుంచి (2014) ప్రత్యేకాధికారుల పాలనలోనే సాగుతోంది. దీంతో ఆయా వార్డులోని ప్రజలు తమ సమస్యలను చెప్పకునేందుకు దిక్కు లేకుండా పోయింది. తాగునీరు, మురుగునీటి సమస్యలు, శిథిలమైన రోడ్లు, విస్తరణకు నోచుకోని రోడ్లతో ట్రాఫిక్ సమస్యలు తదితర సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నా తీర్చే నాథుడే కరువయ్యాడు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు పర్యాయాలు విలీన రాజకీయ క్రీడ నడిచింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2012లో అప్పట్లో రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు సిఫార్సులతో శ్రీకాకుళం మున్సిపాల్టీలో శివారు పంచాయతీలుగా ఉన్న శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఐదు, ఎచ్చెర్ల మండలంలోని రెండు పంచాయతీలు కలిపి మొత్తం ఏడు పంచాయతీలను శ్రీకాకుళం మున్సిపాలిటీలో విలీనం చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. శ్రీకాకుళం నగరంలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ పెద్దపాడు పంచాయతీ ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. విలీనంపై హైకోర్టు స్టే ఇచ్చింది. మూడేళ్ల తర్వాత అంటే 2015లో పెద్దపాడును పంచాయతీగా కొనసాగవచ్చునంటూ హైకోర్టు తీర్పునిచ్చింది. 2018 జూన్‌లో టిడిపి హయాంలో ఏడు పంచాయతీల విలీన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీకాకుళం రూరల్ మండలం ఖాజీపేట, కిల్లిపాలెం, చాపురం, పాత్రునివలస, పెద్దపాడు ఎచ్చెర్ల మండలం తోటపాలెం, కుశాలపురం పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ జారీ చేసిన 2019, డిసెంబర్‌లో 365 ఉత్తర్వులను వెలువరించింది. దీనిపై ఖాజీపేట, ఎచ్చెర్ల మండలం తోటపాలెం, కుశాలపురం గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. వీటిపై ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు 2020 ఫిబ్రవరిలో పంచాయతీల డి-నోటిఫికేషన్ ఉత్తర్వులను కొట్టేసింది.

### 2021లో ఎన్నికలు జరగాల్సి ఉన్నా...

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2021 మార్చిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు 2020 అక్టోబరులోనే మున్సిపాల్టీలకు రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా కసరత్తు ప్రారంభించింది. ఆ సమయంలోనే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచనలతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విలీన ప్రతిపాదనలు పంపారు. దీంతో శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఏడు పంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఉత్తర్వులు వెలువరించింది. ఆ తర్వాత వెనువెంటనే పంచాయతీల డి-నోటిఫికేషన్ ఉత్తర్వులనూ విడుదల చేసింది. అందుకనుగుణంగా కార్పొరేషన్ అధికారులు ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టారు. 2018లో శ్రీకాకుళం నగరానికి కార్పొరేషన్ హోదా దక్కింది. ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా 36 వార్డులను 50 వార్డులుగా విభజించారు. ఎన్నికల నిర్వహణకు ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌నూ సిద్ధం చేశారు. వాటిని ప్రచురించి, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించే ప్రక్రియకు కార్పొరేషన్ అధికారులు సిద్ధమవుతున్న తరుణంలో హైకోర్టు విలీనం ఉత్తర్వులను కొట్టేయడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది.

### ప్రతిసారి తెర పైకి ఏదో ఒక విలీనం సమస్య

శ్రీకాకుళం కార్పొరేషన్‌కు పాలకవర్గం ముగిసిన వెంటనే నిర్విఘ్నంగా ఎన్నికలు జరుగుతున్న పరిస్థితి ఉండేది. 2012లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన విలీన ప్రతిపాదనతో 2014లో జరగాల్సిన ఎన్నికలు ఆగాయి. 2014-19 టిడిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సూచనలతో మున్సిపల్ అధికారులు మరోసారి విలీన ప్రతిపాదనలు పంపడంతో ఎన్నికలు జరగలేదు. 2019-2024 వైసిపి హయాంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాలతో మున్సిపల్ అధికారులు విలీన ప్రతిపాదనలను పంపడంతో 2021 మార్చిలో శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీకాకుళం మండలం రాగోలులో నిర్వహించిన సభలోనూ ఎమ్మెల్యే గొండు శంకర్ నోట విలీన మాట వచ్చింది. రాగోలును కార్పొరేషన్‌లో కలుపుతామంటూ ప్రకటించారు. అయితే ప్రస్తుతం అది కార్యరూపం దాల్చకపోవడం కాస్త ఊరటగా ఉంది.

### ఎమ్మెల్యేల రాజకీయ క్రీడ

శ్రీకాకుళం కార్పొరేషన్ దశాబ్దం కాలం పాటు ఎన్నికలకు దూరంగా ఉండడానికి ఆయా సందర్భాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే ఎన్నికైన చైర్మన్‌కు డిప్యూటీ కేబినెట్ మంత్రి హోదా దక్కుతుంది. అదీగాక మున్సిపల్ పాలనా వ్యవస్థ మొత్తం చైర్మన్ గుప్పిట్లోకి వెళ్తుంది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పనుల కోసం చైర్మన్ చుట్టూ తిరిగే పరిస్థితి ఉంటుంది. నియోజకవర్గంలో ఇది మరో సమాంతర రాజకీయ, పాలనా వ్యవస్థలకు కేంద్రంగా మారే అవకాశముంది. దీంతో ఎన్నికలకు వెళ్లేందుకు ఇష్టం లేకే విలీన ప్రతిపాదనలతో అడ్డుకుంటున్నారన్న విమర్శలూ లేకపోలేదు. నేతల ఆలోచనలు ఎలా ఉన్నా, మున్సిపల్ కార్పొరేషన్‌కు సుదీర్ఘ కాలం పాటు ఎన్నికలు నిర్వహించకపోవడంతో, ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. విలీన సమస్యలను పరిష్కరించి వచ్చే ఏడాదిలోనైనా ఎన్నికలు నిర్వహించాలని అంతా కోరుతున్నారు.



నేపాల్‌లో చిక్కుకున్న వారిలో జిల్లా వాసులు

## నేపాల్‌లో చిక్కుకున్న పది మంది

- ఆందోళన చెందుతున్న కుటుంబసభ్యులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నేపాల్‌లో జిల్లాకు చెందిన పది మంది యాత్రికులు చిక్కుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఈనెల మూడో తేదీన పర్యటన నిమిత్తం అక్కడకు వెళ్లిన వీరి సమాచారం తెలియక కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. నేపాల్‌లో నెలకొన్న అశాంతి పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలుగు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అధికారులు కలెక్టరేట్‌లో అత్యవసర సహాయ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న తమ కుటుంబసభ్యుల గురించిన సమాచారం, సహాయం కోరే ప్రజలు 9491222122 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని అధికారులు తెలిపారు. ఈ హెల్ప్‌లైన్‌ను పర్యవేక్షించేందుకు ముగ్గురు ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ బృందంలో పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి (జనరల్ మేనేజర్, పరిశ్రమల విభాగం) కిరణ్ (9949478989), సీనియర్ సహాయకులు (ఉపకమిషనర్, కార్మిక శాఖ కార్యాలయం) ఎల్.రాజ్యలక్ష్మి (9441022669), సహాయ జిల్లా సమాచార అధికారి (జాతీయ సమాచార కేంద్రం) బి.విజయ్‌బాబు (9110769608) ఉన్నారు. హెల్ప్‌లైన్‌కు వచ్చే ప్రతి కాల్‌ను ఈ బందం స్వీకరించి, అవసరమైన వివరాలను నమోదు చేయనుందని అధికారులు చెప్పారు. సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి, ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌కు చేరవేసి సహాయ చర్యలు వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.

## మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

### ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని ఇద్దివానిపాలెంలో రూ.1,46 కోట్లతో నిర్మించనున్న చేపల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి నుంచి మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న టిడిపి ఇప్పుడు అదే కొనసాగిస్తోందని అన్నారు. ముఖ్యంగా సబ్సిడీపై మత్స్యకారులకు వలలు, వేట సామగ్రి, రాయితీపై డీజిల్, వేట నిషేధ సమయంలో మత్స్యకార భృతి వంటి పథకాలు చంద్రబాబు ప్రవేశపెట్టినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్మించబోయే భవనాలతో మత్స్యకారులు తాము వేటాడే మత్స్య సంపద నిల్వ చేసుకోవడానికి, ఎండబెట్టుకోవడానికి విక్రయించుకోవడానికి అనువుగా ఉంటాయని అన్నారు. మత్స్యకారులు ఈ భవనాలు వినియోగించుకుని క్రయ విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, సర్పంచ్ జి.హనుమంతు, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాళం విజయ కృష్ణ, బెందాళం తిరుమల కుమార్, పుల్లట రాజు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## యూరియా వినియోగం తగ్గించుకోవాలి

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశకి- కంచిలి

వ్యవసాయ సాగులో రైతులు యూరియా వినియోగం తగ్గించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. మండలంలోని గోకర్ణపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సాగు సంబంధమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగులో ఎరువుల వినియోగం తగ్గించుకుంటే చీడ, పీడలు దూరం అవ్వడమే కాకుండా వ్యయం తగ్గుతుందన్నారు. సాగు విస్తీర్ణం ఇతర వ్యవసాయ సంబంధిత వివరాల విషయంలో రైతులు చెప్పిన వివరాలు, అధికారులు చెప్పిన వివరాల్లో తేడాలు ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. సరైన సమాచారం లేకుండా రైతులకు మీరేం సేవలు అందిస్తున్నారంటూ ఆగ్రహించారు. ఈ విషయంలో తహశీల్దార్, ఎఒ, కిందిస్థాయి సిబ్బంది నోటీసులు ఇస్తానన్నారు. పైడిగాం ఛానల్‌లో గోకర్ణపురం, శాసనం గ్రామాల వద్ద రెండు కల్వర్టులు నిర్మించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. గ్రామానికి చెందిన కొల్లాన లోకేశ్వరరావు రెండేళ్లుగా పూర్తి అనారోగ్యానికి గురై కదలిలేని స్థితిలో ఉన్నానని, తనకు పింఛను మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని పాఠశాలను సందర్శించి బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుమలరావు, తహశీల్దార్ రమేష్, ఎడిఎ భవానీశంకర్ పాల్గొన్నారు.

## 4, 5న సిఐటియు జిల్లా మహాసభలు

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - సోంపేట

అక్టోబరు 4, 5 తేదీల్లో సిఐటియు జిల్లా 12వ మహాసభలను సోంపేటలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశాన్ని పట్టణంలోని కార్మిక సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 4న ఉదయం పది గంటలకు సోంపేట తిరుమల థియేటర్ నుంచి గాంధీ మండపం వరకు ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరవుతారని చెప్పారు. ప్రదర్శనలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, శ్రామిక మహిళలు, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ధరల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు, అంగన్వాడీ, ఆశ తదితర స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి నష్టపోయిన ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు భృతి కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మందస జీడి పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కాపాడాలని కోరారు. అసంఘటిత కార్మికులు దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారని వారికి పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా బి.హైమావతి, ప్రధాన కార్యదర్శిగా జుత్తు సింహాచలం, కోశాధికారి గా ఎస్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.గోపీనాథ్, డి.కృష్ణారావు, కె.రాజు, వి.హేమలత, ఎన్.గణపతి, సత్య, కౌసల్య, భవాని, ఎస్.జయరాం, సహాయ కార్యదర్శులుగా పి.చిరంజీవి, ఎన్.హైమా వతితో పాటు ఆరుగురిని, కమిటీ సభ్యులుగా 19 మందిని ఎన్నుకున్నారు. సమావేశంలో సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల నుంచి అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

- లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డిఎస్‌పిలు, సిఐ స్థాయి అధికారులతో లోక్ అదాలత్ కేసులు, మహిళల మిస్సింగ్ కేసుల దర్యాప్తు, ట్రేసింగ్, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, హత్య, మర్డర్ ఫర్ గైన్ తదితర కేసులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ స్థాయిలో రాజీ అయ్యేందుకు అవకాశమున్న కేసులను ముందస్తుగా గుర్తించాలన్నారు. ఇరు వర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశమున్న, వారి సమ్మతితో కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఇతర కాంపౌండు కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలతో సంప్రదించి లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

గత రెండేళ్లలో నమోదైన పెండింగ్‌లో ఉన్న మహిళల మిస్సింగ్ కేసులపై దృష్టిసారించాలని ఆదేశించారు. సాంకేతిక, ఇతర ఆధారాల ఆధారంగా మిస్సింగ్ మహిళలను త్వరితగతిన గుర్తించి ఛేదించాలని సూచించారు. ఏడాదిలో తప్పిపోయిన మిస్సింగ్ కేసులను శత శాతం ట్రేస్ చేయాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్‌తో పాటు ఇతర కేసుల్లో కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆయా నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు చేసేందుకు చేసిన ప్రయత్నం, ప్రగతి తదితర అంశాలపై పూర్తిస్థాయిలో ఆరా తీసి పెండింగ్ ఎన్‌బిడబ్ల్యు త్వరితగతిన అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, డి.లక్ష్మణరావు, ఎస్‌బి సిఐ ఇమ్మానుయేల్ రాజు, డిఎస్ఆర్‌బి సిఐ శ్రీనివాస్, సిఐలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

## అంగన్వాడీలకు రూ.26 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ప్రజాశక్తి- గార

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి హెచ్. అమ్మన్నాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గార ప్రాజెక్టు మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 డిసెంబర్ 2024 జనవరిలో చేసిన 42 రోజులు సమ్మె పోరాటం చారిత్రాత్మకమైనదని అన్నారు. ఆ సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. సమ్మె పోరాట శిబిరాలకు కూటమి నాయకులు వచ్చి మేం అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీలకు వేతనాలు కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి పెంచలేదని అన్నారు. ఆరేళ్ల కాలంలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పనిభారం పెరిగిందని, కానీ ఒక్క రూపాయి వేతనమూ పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు డిఎ, పిఆర్‌సి అమలు చేయడం లేదని అన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ మాట్లాడుతూ అంగన్వాడీలకు యాప్‌లు భారం పెంచడం వల్ల ప్రీస్కూల్‌కు ఇబ్బంది అవుతుందని తెలిపారు. అంగన్వాడీలకు ఆన్‌లైన్ పనులు ఒక యాప్ మాత్రమే ఉండాలన్నారు. సెంటరు నిర్వహణకు 5జి నెట్‌తో నాణ్యమైన ట్యాబులు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. గ్రాట్యూటీ జిఒలు మార్పులు చేయాలన్నారు. హెల్పర్లు ప్రమోషన్ల విధి విధానాలు రూపొందించాలన్నారు. పోరాటాలు ద్వారానే హక్కులు సాధ్యమన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షునిగా ఆర్.రేణుక, అధ్యక్షునిగా పి.పద్మలత, ప్రధాన కార్యదర్శి జల్లు కాంచన, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా వి.మంగమ్మ, గౌరి, నాగమణి, రాజేశ్వరి, వసంత, మాలత, లక్ష్మి 25 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యలకు 15 రోజుల్లోగా పరిష్కారం లభించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక అల్టిమేటం జారీచేసింది. ఈ మేరకు కవిటి మండలంలో జెఎసి నాయకులు ఎంపిడిఒ త్రినాథ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం జెఎసి నాయకులు హరిచంద్ర, చాణిక్య, కష్ణ, బలరాం తదితరులు మాట్లాడుతూ తాము ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నామని అనానరు. తమని ఇంటింటికీ తిరిగి సర్వేలు చేయించడం, సెలవులు, పండగలు, ఆదివారాల్లో బలవంతపు పనులు చేయించడం వల్ల అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యలు గుర్తించి ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఇంటింటికీ తిరగడం వంటి బలవంతపు పనుల నుంచి విముక్తి కల్పించి, ఉద్యోగులను మాతృశాఖలకు మళ్లించాలని కోరారు. అదే విధంగా కార్యాలయ వేళలకు విరుద్ధంగా వీడియో కాన్ఫరెన్స్‌ల రద్దు చేసి, నోషనల్ ఇన్క్రిమెంట్ల మంజూరు చేసి, ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఎఎస్ ప్రకారం ప్రత్యేక ఇన్క్రిమెంట్ ఇవ్వాలని కోరారు. అలాగే అసిస్టెంట్ కేడర్ మార్పు, ప్రమోషన్ ఛానెల్స్ ఏర్పాటు చేసి, పారదర్శక బదిలీ విధానాలు అమలు చేయాలని కోరారు. 15 రోజుల్లోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే కఠినమైన పోరాటానికి సిద్ధమని ఐక్యవేదిక నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అబ్దుల్ ఖాన్, జెఎసి సభ్యులు రవిరాం, దీపిక, కుమారస్వామి, ప్రకాష్, బోగేష్, జానకిరామ్, భవాని, లావణ్య, సంతోష్, హర్ష పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు



పవర్ ప్లాంట్ సర్వే బృందాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

## థర్మల్ ప్లాంట్ సర్వే అడ్డగింత

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అడ్డూరుపేట, తిమడాం, జె.వి పురం సమీపంలో థర్మల్ పవర్ ప్లాంట్ కోసం బుధవారం చేపట్టిన సర్వేను ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. జెన్‌కో సంస్థతో పాటు జపాన్‌కు చెందిన ప్రతినిధులు ఈ గ్రామాలకు చేరుకుని డ్రోన్ల సాయంతో సర్వే చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకున్నారు. తమ భూములను బీడుగా మార్చే థర్మల్ పవర్ ప్లాంట్ వద్దని పలుమార్లు స్పష్టం చేసినా, మళ్లీ సర్వే చేపట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సర్వేను నిలుపుదల చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించడంతో, వారు వెనుదిరిగారు.

## 'స్త్రీ శక్తి'పై నేడు డయల్ యువర్ ఆర్ఎం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మహిళా ప్రయాణికుల కోసం ఆర్‌టిసి అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు గానూ సలహాలు, సూచనలు స్వీకరించాలని నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణ అధికారి సిహెచ్.అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 'డయల్ యువర్ ఆర్ఎం' పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఈనెల 11వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోని నాలుగు డిపోల నుంచి ప్రజలు నేరుగా తమ అభిప్రాయాలను ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమకు ఎదురవుతున్న సమస్యలు, పథకంలో చేయాల్సిన మార్పులపై విలువైన సలహాలను నేరుగా అధికారులకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సూచనలు అందించడానికి 9959225603 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. మహిళా ప్రయాణికుల భాగస్వామ్యంతో 'స్త్రీ శక్తి' పథకాన్ని మరింత పటిష్టం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.



సోంపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## 'రణభేరి జాతా'ను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - సోంపేట**

ఈనెల 15 నుంచి నిర్వహించనున్న రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రం సోంపేటలో రణభేరి జాతా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను ప్రకటించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు ఎస్.కూర్మారావు, జి.దొరబాబు, జి.శ్రీనివాసరావు, పైల హేమచంద్రరావు, పి.కుమార్ స్వామి, బి.తేజేశ్వరరావు, జి.ఈశ్వరరావు, జి.సింహాచలం పాల్గొన్నారు.

**కవిటి:** ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు, బోధనేతర కార్యక్రమాల విషయమై యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించనున్న రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీప్రసాద్, సిపి ఎస్ కో-కన్వీనర్ జానకిరావు కోరారు. కవిటిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.



సన్మానిస్తున్న సిబ్బంది

## 'ఐతమ్'లో సెమినార్

**ప్రజాశక్తి - టెక్కలి రూరల్**

టెక్కలి ఐతమ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ భాగస్వామ్య విభాగాలకు చెందిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ట్రైటెక్ కాన్ ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ సంస్థ హైదరాబాద్ బ్రాంచికు చెందిన యంత్రి సిఇఒ చింత తులసీరావు బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారి అనుభవాలు ముచ్చటించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతో అవసరమని అన్నారు. అందుకు తగ్గ కోర్సుల్లో శిక్షణలు తీసుకుని, కొత్త ప్రాజెక్టులు రూపొందించాలని అన్నారు. ఐతమ్ కళాశాలకు అన్ని ఆధునిక సదుపాయాలు కలిగిన లాబ్‌లు ఉన్నాయని అన్నారు. అందుకు తగ్గ నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐటి హెచ్‌ఒడి డాక్టర్ బాలక రమేష్‌నాయుడు, సివిసిస్ హెచ్‌ఒడి డాక్టర్ వై.రమేష్ పాల్గొన్నారు. అనంతరం తులసీరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

## వంశ చరిత్ర తెలుసుకోవాలి

**ప్రజాశక్తి - టెక్కలి**

తమ వంశ చరిత్రలపై చిన్నతనం నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఓక్రిడ్జ్ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లా మధులత అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్, జీవితం వంశ చరిత్ర మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. కుటుంబ వ్యవస్థకు మూల స్తంభాలు వంటి వారిని అన్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తాత, అమ్మమ్మ, నానమ్మలను ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని విద్యార్థులతో వారికి పాదాభివందనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన కళా సాంస్కృతిక ప్రదర్శనలు చిన్నారుల నృత్యాలు పలువురిని అలరించి ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కవిటి : సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

## బదిలీ మరో మజిలీ

**ప్రజాశక్తి - కవిటి**

ఉద్యోగస్తునికి బదిలీ మరో మజిలీ లాంటిదని ఎంఇఒ-2 సనపల రామకృష్ణ అన్నారు. మండలంలోని బొరివంక ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు జగన్ బిసాయి, రేణుకలను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. గత కొన్నేళ్లుగా వారు పాఠశాలకు అందించిన సేవలు కొనియాడారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న విద్యా కమిటీ చైర్మన్ బందావన్ బిసాయిని సిబ్బంది, గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ పాణిగ్రాహి, బల్లెడ లక్ష్మణరావు, బల్లెడ మోహనరావు, బల్లెడ జయప్రకాష్ పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** స్థానిక ఎంపిపి పాఠశాలలో ఇటీవల బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఎల్.వి.రమణ, కందుల భవాని, పి.ఎస్.కె.పావని, లక్కోజు వెంకటరమణలను ఎంఇఒలు జలుమూరు చిన్నవాడు, బి.అర్జునుడు సన్మానించారు. కార్యక్రమంలో పిఎస్ఎంఎస్ చైర్మన్ కూటికి కాంతారావు, సర్పంచ్ కొంగవట్టు లక్ష్మి, ప్రతినిధి అప్పారావు, మెండ అప్పారావు, పి.కృష్ణారావు పాల్గొన్నారు.

## గుర్తుకొస్తున్నాయి

**శ్రీకాకుళం సిటీ:** తమ పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని పూర్వపు విద్యార్థులు అన్నారు. 1972 బిఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని ఒక హోటల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. 53 ఏళ్లనాటి తీపి జ్ఞాపకాలను, అనుభవాలను అందరూ పంచుకున్నారు. ఈ సమ్మేళనానికి హాజరైన వారు కుటుంబాలతో సహా హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసేలా పలువురు తమ ప్రసంగాలు, పాటలతో అలరించారు. కార్యక్రమానికి కన్వీనర్ పిండి నాగేశ్వరరావు ఆహ్వానం పలికారు. నిర్వాహకులు బొడ్డేపల్లి చిరంజీవిరావు, ఎ.కాశీబాబు, పిఎస్ఆర్ మూర్తి, దుంపల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల కలయిక

# దారులు మారలేదు..

**• అధ్వానంగా గ్రామీణ రహదారులు • చోద్యం చూస్తున్న అధికారులు • తప్పని అవస్థలు**



గోతులమయమైన అల్లెన నుంచి పాలకొండ రహదారి

సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లుగా మారుస్తాం. ప్రజల రహదారి కష్టాలను తీరుస్తామని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి పలుమార్లు ఉద్ఘాటించిన మాటలు. అయితే సంక్రాంతి కాదు, ఉగాది, వినాయక చవితి దాటిపోయినా చాలా ప్రాంతాల్లో గుంతల రొడ్డులు దర్శన మిస్తున్నాయి. గ్రామీణ రోడ్ల నుంచి ప్రధాన రహదారుల వరకు అది ఏ రహదారులైన గొతులు, గతుకులతోనే కనిపించడం సర్వసాధారణం అయిపోయింది. ఎండాకాలంలో కంకర తేలి, గుంతలు, గోతులతో దర్శనం ఇచ్చిన రహదారులు నేడు వర్షాకాలం చిన్నపాటి వర్షానికి వర్షంనీటితో గోతులు నిండి ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తరోడ్లు కాదు కదా కనీసం ప్యాచ్‌వర్క్‌లు చేయకపోవడం విడ్డూరం.

**ప్రజాశక్తి - బూర్జ**

పాలకొండ నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా గోతుల మయంగా మారింది. ముఖ్యంగా బూర్జ మండలంలోని అల్లెన, ఒవిపేట, కొల్లివలస, పాలవలస, బొమ్మిక తదితర గ్రామాల వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో అనునిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ఈ గోతుల్లో పడి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కనీసం గోతుల కప్పేందుకు కూడా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని వాపోతున్నారు. అలాగే మండలంలోని అల్లెన నుంచి పాలకొండకు వచ్చే రహదారి కూడా రాళ్లుతేలి గోతులతో దర్శనమిస్తున్నాయి. అలాగే తోటవాడ, అన్నంపేట, కొల్లివలస, మామిడి వలస రహదారులు కూడా పూర్తిగా రాళ్లుతేలి గోతులమయంగా తయారయ్యాయి.



అడుగడుగునా గుంతలతో ఉన్న వైకుంఠపురం, రొట్టవలస రహదారి

### అనునిత్యం అవస్థలే



గోతులు ఏర్పడిన రహదారిపై ప్రయాణం అనునిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో అదుపుతప్పి గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలి.

**డి.సాయి, ఆటోడ్రైవర్, అల్లెన**

### రాళ్లు తేలిన రహదారులు

దశబ్దరకాలంగా రాళ్లు తేలిన, అడుగడుగునా గోతుల రహదారులపై ప్రయాణాలు సాగించలేక ప్రమాదాలకు గురై ఇబ్బందులకు ఎదుర్కొం టున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రహదా రులను గొతులు లేని రహదారులుగా మారుస్తామని ప్రకటించినప్పటికీ ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ ంతో పాటు సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి రహదారుల బాగుకు కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.



తుడ్డలి వద్ద ప్రమాదకర గోతులతో శ్రీకాకుళం, పాలకొండ ప్రధాన రహదారి

### ఎన్నాళ్లీ కష్టాలు



అడుగడుగునా గోతులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదంగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే రహదారి మెరుగుకు చర్యలు చేపట్టాలి.

**ఎం.సంగీత, జి.వి.పురం**

## పరిశ్రమల హబ్‌గా మారుస్తా

**ప్రజాశక్తి - ఆమదాలవలస**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత పరిశ్రమల స్థాపనకు సహకరిస్తే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా మార్చి నిరుద్యోగులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద 32 వేల కోట్లతో 3200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు, పొందూరు మండలంలోని ఎనిమిది వందల ఎకరాల ప్రభుత్వ భూమిలో సోలార్ మాడ్యూల్స్ సెల్స్ తయారుచేసే పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపట్టడం జరిగిందని, అలాగే లక్నోలో ఉన్న ప్యూయల్ యూనివర్సిటీని నియోజక వర్గంలో ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నానని తొందరలోనే అది కార్యరూపం దాల్చనుందన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళాలో ఎంపికైన నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ అప్పలనాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ సాయికుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, టిడిపి నాయకులు ఎస్.మురళీధర్, మురళీధర్ యాదవ్, కూన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




అభ్యర్థులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

## నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

**ప్రజాశక్తి - రణస్థలం**

ఉచిత బస్సు పథకం వలన ఉపాధి నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్, డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.30 వేలు చెల్లించాలని కోరుతూ ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని రణస్థలం, కోష్ట, పైడిభీమవరంలో బుధవారం ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వలన ఉపాధి నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఏడాదికి రూ.30 వేలు చొప్పున భృతి ఇచ్చి ఆదుకోవాలని, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐతో కూడిన సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 11న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోలు, వాహన విడిభాగాలు, ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, ఆర్‌టిఎ చలానాలు మరోవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో రోజంతా ఆటో, వ్యానులు నడిపినా పూట గడవడమే కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు భారమైన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్ తగ్గించాలని, డీజిల్, పెట్రోల్‌పై ఉన్న వ్యాట్, సెస్ ఎత్తివేయాలని పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్లె కాంతారావు, లెంక అప్పలకొండ, పి.నాగిరెడ్డి, జీరు రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

# మండల సమావేశం రసాభాస

### నిధుల విడుదలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం




సమావేశంలో టిడిపి, వైసిపి సభ్యుల వాగ్వివాదం

**ప్రజాశక్తి - లావేరు**

మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. తొలుత శాఖల వారీగా మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రాజ్ శాఖ సమీక్ష సందర్భంగా గ్రామాల్లో కూటమి నాయకులకు అధికారులు సమాచారం ఇచ్చివారు చెప్పినట్లుగానే పని చేస్తున్నారని వైసిపికి చెందిన గుర్రాలపాళెం ఎంపిటిసి జనపాల బానోజీరావు సభ దృష్టికి తీసుకురాగా దానికి టిడిపికి చెందిన బుడతవలస ఎంపిటిసి ముళ్ల సాయికుమార్ అధికారంలో ఉన్నప్పుడు మీరు ఏమి చేశారని, మమ్మల్ని ఎక్కడైనా పిలిచారా, నిధులు ఇచ్చారా అని జవాబు చెప్పడంతో వైసిపి సభ్యులు జగ్గురోతు తవిటినాయుడు, నారాయణరావు, దేశెట్టి తిరుపతిరావు, మీసాల శ్రీనువాసరావు, సెక్చాన్ భాషా, బానోజీరావుకి మద్దతు ఇస్తూ గ్రామాల్లో కూటమి నాయకులకే ఎక్కువ నిధులు కేటాయించారని ముల్లు సాయికుమార్‌పై మూకుమ్మడిగా వాగ్వివాదం చేశారు. గడిచిన నాలుగేళ్లలో వైసిపి ఎంపిటిసిలు ప్రాతినిధ్యం వహిస్తున్న గుమ్మడాం పంచాయతీకి రూ.18.50 లక్షలు, తాళ్లవలస పంచాయతీకి రూ.19.50 లక్షలు నిధులు కేటాయించి టిడిపికి చెందిన తమ పంచాయతీకి నాలుగేళ్లలో కేవలం రూ.6 లక్షలే నిధులు కేటాయించడం ఇది రాజకీయ వివక్ష కాదా అని బుడతవలస ఎంపిటిసి సాయికుమార్ బదులివ్వడంతో మాటామాట పెరగడంతో అధికార, ప్రతిపక్ష సభ్యులు మధ్య నువ్వెంత అంటే నువ్వు ఎంత అంటూ ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ సభలో గందరగోళం ఏర్పడింది.

దీంతో ఏమి జరుగుతోందనని కార్యాలయంలో వున్నవారు సమావేశం మందిరం వద్దకు చేరుకొని తిలకించారు. కూటమి నాయకులకు పనుల తీర్మానాన్ని ఎందుకు ఇచ్చారని వైసిపి సభ్యులు ప్రత్యేకాహ్వానితులు బాలకృష్ణను నిలదీశారు. దీంతో బాలకృష్ణ వివరణ ఇస్తూ తాను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు సూచన మేరకు మండలం అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో తీర్మానం ఇవ్వడం జరిగిందని, తద్వారా చాలా అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, అందరూ సర్దుబాటు చేసుకుని వెళ్లాలని అపీలు చేయడంతో వివాదం సద్దు మణిగింది. మండలంలో ప్రతి గ్రామంలో బెల్టుషాపులు ఉన్నాయని, మద్యం ఏరులై పారుతుందని ఎక్సైజ్ ఎస్ఐ షర్మిలను నిలదీశారు. ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఎఒ మహేష్ నాయుడు మాట్లాడుతూ మండలంలోని రైతాంగానికి సరిపడా యూరియా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ వెంకటరాజు, సూపరింటిండెంట్ సునీత, ఎపిఒ సత్యవతి, ఎపిఎం సుబ్బయ్య నాయుడు, సిడిపిఒ రూపలత, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

## ఫేక్ ఐడితో నగదు స్వాహా

**ప్రజాశక్తి - పలాస**

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో అమెజాన్ ఏజెన్సీ ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి ఫేక్ ఐడి ద్వారా రూ.35,400 స్వాహా చేశాడు. ఇంకా రూ.2 లక్షలు ఇస్తే అనుమతులు ఇప్పిస్తానని చెప్పడంతో అనుమానం వచ్చి బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో బండారం బయట పడింది. ఆన్‌లైన్ నగదు జార్ఖండ్‌లో ఉన్న ఉన్న ఓ వ్యక్తికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. కాశీబుగ్గ కెటి రోడ్డులో వివిధ పత్రికలకు ఏజెన్సీ నిర్వహిస్తున్న జి.తిరుమలకు ఈ నెల 6న అపరిచిత వ్యక్తి కలిశారు. తనది ఎస్.కోట మండలం ధర్మవరమని, తన పేరు హర్షవర్ధన్గా పరిచయం చేసుకున్నాడు. తాను అమెజాన్ ఏజెంట్లుగా నియవించడానికి ఈ ప్రాంతంలో అధికారిగా నియమించారని అన్నారు. ఏజెన్సీ కావాలంటే తనకు సంప్రదించాలని కోరాడు. దీంతో ఆయన వేషభాష చూసి ఆయన్ను నమ్మాడు. తనకు ముందుగా రూ.35,400 నగదు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరాడు. దీంతో తిరుమల ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేశాడు. దీంతో ఆయన వెళ్లిపోయాడు. మంగళవారం సాయంత్రం మళ్లీ వచ్చి రూ.2 లక్షలు నగదు ఇస్తే ఏజెన్సీ ఖరారు చేస్తానని, ఫోన్‌పే ద్వారా నగదు ఇవ్వాలని కోరారు. అదీ కూడా త్వరగా కావాలని అనడంతో తిరుమలకు అనుమానం వచ్చింది. స్థానికంగా ఉండే అమెజాన్ ఏజెన్సీ గురించి అడిగి తెలుసు కున్నాడు. కొత్తగా మరో బ్రాంచ్ ఇచ్చే అవకాశాలు లేవని, గుర్తించి తనకు మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నాడని అనుమానం వచ్చి కాశీబుగ్గ పోలీసులకు ఆశ్రయించాడు. దీంతో హర్ష వర్ధన్ను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

## పశువులు పట్టివేత

**ప్రజాశక్తి - లావేరు**

అక్రమంగా రెండు లారీల్లో పశువులు రవాణా చేస్తున్న వాహనాలను ఎస్ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జాతీయ రహదారిపై బుడుమూరు సమీపంలో రెండు లారీల్లో 28 పశువులను ఒడిషాకు చెందిన నలుగురు తరలిస్తుండగా పట్టుకున్నట్లు హెచ్‌సి జోగారావు తెలిపారు. వాహనాలు సీజ్‌చేసి పశువులను విజయనగరం జిల్లా గుజ్జంగగవలస గోశాలకు తరలించినట్లు చెప్పారు. నలుగురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

## చిన్నతరహా పరిశ్రమలకు తోడ్పాటు

**ప్రజాశక్తి - పలాస**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నతరహా పరిశ్రమల నిర్వహణకు తోడ్పాటు అందిస్తుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంఎస్ఎంఇపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా చిన్నతరహా పరిశ్రమలు ఉంటే వారు అభివృద్ధి చెందేందుకు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేసే సమయంలో పర్యావరణం పరిరక్షణకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. జెడ్ ధ్రువపత్రాల ద్వారా వ్యాపారులు నిర్వహిస్తున్న పరిశ్రమలకు గుర్తింపునిచ్చి రూ.3 లోల వరకు రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 చెరుకుపల్లి సత్యం, చాన్‌బాబు, మనీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైకుంఠరావు

## రేషన్ షాపు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - మెళియాపుట్టి**

మండలంలోని పెద్దకేదారి గిరిజన గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని గిరిజన సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బడే పాపారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యశ్వంత్ కుమారురెడ్డిలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. పెద్దకేదారి, గేటుపేట తదితర గిరిజన గ్రామాల ప్రజలు ప్రస్తుతం రేషన్ కోసం దాదాపు పది కిలోమీటర్లు దూరంలోని రామచంద్రపురం రేషన్ డిపోకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు బైరసింగి ధరణి, సవర కుమార్, సవర చక్రపాణి, ఎస్.కామేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

### ఎపిఎంగా కూర్మారావు

**ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురం ఎపిఎంగా పూడి కూర్మారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మందస ఎపిఎంగా పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయనకు మండల సమైక్య సిబ్బంది, విఒఎలు, గ్రామ సంఘ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘ సభ్యులు

# పోటాపోటీగా ఆటల పోటీలు



కోటబొమ్మాళి : ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

**కోటబొమ్మాళి:** స్కూల్ గేమ్స్ పెడరేషన్ కార్యాక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటాపోటీగా తలబడుతున్నారు. బుధవారం ప్రారంభమైన ఈ పోటీల్లో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షిటల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామని పీడీ వాసుదేవరావు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన విజేతలు డివిజల్ స్థాయిలో ఆడుతారని అన్నారు. ఈ ఆటల పోటీలను ఎంఇఒ డి.గోవిందరావు పరిశీలించారు.

**నరసన్నపేట:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని మాజీ సర్పంచ్ జి.చిట్టిబాబు సూచించారు. నరసన్నపేట ప్రభుత్వ పాఠశాలల్లో మండలస్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ మేరకు విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మిమెంట్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, కింజరాపు రామారావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రూప, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వి.రమణయ్య, ఎన్.వి.రమణయ్య పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి:** మండల విద్యాశాఖ ఆధ్వర్యాన 2025-26 విద్యా సంవత్సరానికి చెందిన ఎస్‌జిఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ంమారు 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భానుప్రకాష్ అధ్యక్షత ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. బాలురుకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా వంటి క్రీడాంశాలు అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒలు చిన్నవాడు, అర్జునుడు పాల్గొని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ కర్రి గిరి, పీడీ జనార్ధనరావు, ఎంఎస్ఒ తిరుపతిరావు, నాగరాజు వెంకటరమణ, శ్యామ్, రాజులు రెడ్డి, ప్రమీల, ప్రభావతి పాల్గొన్నారు.

**టెక్కలి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత కల్పిస్తామని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావుల ఆధ్వర్యాన మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని 22 పాఠశాలల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ఆర్గనైజర్ బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణరాజా, యరపత్ని వెంకటరమణ, కె.కె.రామిరెడ్డి, సిహెచ్, జగ్గమ్మ, ఆదిశేషు, సూర్యాకాంతం, ఎస్.రమేష్, పి.జగదీష్, నీలయ్య, కాపల రఘునాథరావు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు :** మండలంలోని నగరంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి అండర్- 14, అండర్- 17 విభాగాల్లో క్రీడా ఎంపిక పోటీలు ముగిశాయి. బుధవారం ఖోఖో, వాలీబాల్, చెస్ ఎంపికలు చేపట్టారు. మండలంలోని 16 ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల నుంచి 190 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 77 మంది డివిజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, ఎస్‌ఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, మండల స్పోర్ట్స్ కో- ఆర్డినేటర్ పి.గజేంద్రరావు, వ్యాయమ ఉపాధ్యాయులు జె.నారాయణ, మున్నా, శివ, రమ్య, వెంకటేశ్వరి, శ్రీను, కోటి, హరి, వాణీకుమారి తదితరులు పాల్గొన్నారు.

**టెక్కలి:** సమాజంలో వివిధ ప్రదేశాల్లో నివశిస్తున్న బాలికలు తమ ఆత్మరక్షణ నేపథ్యంలో చైతన్యం అవసరమని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గొంటి తిరుపతిరావు అన్నారు. సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఎస్.విద్య, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సరస్వతి, జలజాక్షి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

**బూర్జ:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆటల పోటీలకు సంబంధించి విద్యార్థులను ఎంపిక చేపట్టారు. ఎంఇఒలు శ్యాంసుందరరావు, ధనుంజయరావులు ఆధ్వర్యంలో 14, 17 సంవత్సరాల విద్యార్థిని, విద్యార్థులకు ఖోఖో, కబడ్డి, వాలీబాల్, షెటిల్ బ్యాట్మెంటైన్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.లక్ష్మీనారాయణ, పిఇటి ఈది అప్పన్న పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డిఎల్‌పిఒ గోపిబాల

## డిఎల్‌పిఒ విచారణ

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

మండలంలోని మతలబుపేట పంచాయతీ ఏకగ్రీవ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసిన వ్యక్తి విచారణకు హాజరు కాకపోవడంపై డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.గోపి బాల అసంతృప్తి వ్యక్తం చేశారు. 2017లో మతలబుపేట సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో పంచాయతీకి మంజూరైన రూ.7 లక్షల నిధులు దుర్వినియోగం జరిగినట్లు అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సనపల తవిటినాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు నిధుల దుర్వినియోగంపై బుధవారం మతలబు పేటలో డిఎల్‌పిఒ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ విచారణకు అప్పటి పంచాయతీ పాలకవర్గ సభ్యులు హాజరై రూ.7 లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు, ఎంబుక్ రికార్డులను అధికారుల ముందు ఉంచారు. విచారణ అధికారులు ఫిర్యాదుదారుడు కోసం చాలా సమయం ఎదురు చూసినప్పటికీ ఆయన హాజరుకాకపోవడంతో అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు. ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు చేసి ప్రభుత్వ అధికారుల సమయాన్ని వృథా చేయటం ఎందుకని అధికారుల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విచారణలో మండల పంచాయతీ అధికారి బి.రామారావు, కార్యదర్శి, టిడిపి నాయకులు నూక కోటేశ్వరరావు, ప్రభాకరరావు, సనపల రాజు, పైడి తవుడు, రంగనాథం పాల్గొన్నారు.

## వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

**ప్రజాశక్తి -సంతబొమ్మాళి, శ్రీకాకుళం, బూర్జ**



జగన్నాయకులు

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు సంతబొమ్మాళి మండలం కెల్లి జగన్నాయకులు, శ్రీకాకుళం నగరానికి చెందిన ఎన్ని ధనుంజయరావు, బూర్జకు చెందిన గుమ్మడి రాంబాబులను అధిష్టానం నియమించింది. ఈ మేరకు వైసిపి రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసింది. జగన్నాయకులు మొదటి నుంచీ వైసిపిలో కొనసాగారు. పార్టీ అధినేత జగన్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయి. టెక్కలి నియోజకవర్గంలో పార్టీకి అవసరమైన సేవలు అందించారు. సంతబొమ్మాళి పిఎసిఎస్ అధ్యక్షునిగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

## రసవత్తరంగా క్రీడా ఎంపికలు

**పలాస:** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన మండలస్థాయి ఎస్‌జిఎఫ్-14, 17 బాల బాలికలకు కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా ఎంపికలు బుధవారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీలో బాలురు బాలికలు 30 మంది, బ్యాడ్మింటన్ 20 మంది, యోగా 20 మంది ఎంపికై డివిజన్ స్థాయిలో పాల్గొంటారు. అలాగే గురువారం ఖోఖో, వాలీబాల్, చెస్ ఎంపికలు చేపట్టనున్నారు. సమయానికి తగినట్లుగా క్రీడాకారులు హాజరుకావాలని ఎమ్మెస్వో ఎస్.చంద్రశేఖర్ కోరారు. ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సంతోష్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.తాతయ్య, పి.ఖృష్ణారావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి.తవిటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్. పద్మ లోచనం, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎస్.వి.జోగారావు, రా మోజీ, టి.గీత, పి.సునీత, టి.గణేష్, బి.రవికాంత్ న్యాయ నిర్ణేతలుగా నిర్వహించారు.



రేషన్ సబ్ డిపోను ప్రారంభిస్తున్న సురేష్

## ప్రజల సౌకర్యం కోసమే సబ్ డిపో

**లావేరు:** చిన్నయ్యపేట గ్రామ ప్రజల సౌకర్యార్థమే రేషన్ సబ్‌డిపో ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అన్నారు. బుధవారం చిన్నయ్యపేటలో రేషన్ సబ్‌డిపోను ఆయన ప్రారంభించారు. మురపాకలో రేషన్‌డిపో ఉండడంతో చిన్నయ్యపేటకు మూడు కిలోమీటర్లు దూరం కావడం, రహదారి సరిగా లేకపోవడంతో రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడటంతో గ్రామంలోనే సబ్‌డిపో పెట్టి కార్డుదారులకు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సురేష్‌ను సర్పంచ్ కలిశెట్టి భాస్కరరావు, గ్రామస్తులు సన్మానించారు. మజ్జి రమణ, మీసాల రామునాయుడు, కలిశెట్టి తమ్మి నాయుడు, ఎంపిటిసి రామనాయుడు, ఎం.చక్రధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.




విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**పొందూరు:** ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని లీడ్ బ్యాంకు ఎల్‌డిఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు తెరవడం, పొదుపు ప్రాముఖ్యత, ఆన్‌లైన్ లావాదేవీలు వంటి అంశాలపై అవగాహన కలిగించారు. వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించినా, తమ ఖాతాలో నగదు తగ్గుతున్నట్లు గుర్తించినా వెంటనే 1930 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పెనుబర్తి ఎస్‌బిఐ మేనేజర్ భాస్కరరావు, తోలాపి ఎపిజివిబి మేనేజర్ మనోహర్, కళాశాల అధ్యాపకులు హరినాథ్, హరిబాబు, లక్ష్మణరావు, రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

**కొత్తూరు :** స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం ఎ.లలితకుమారి అధ్యక్షతన మంగళవారం ఉదయం సిసిలు, విఒలతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో నివగాంకు చెందిన బురాడ రాకేష్. బూరాడ కమలహాసన్లు అనుమతి లేకుండా సమావేశ మందిరంలోకి వచ్చారు. అనంతరం వీడియోలు తీస్తూ... భయబ్రాంతులకు గురిచేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులకు గుర్తింపుకార్డుల పంపిణీ

**ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు**



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న రుద్రమూర్తి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లిసారథి విద్యార్థులకు గుర్తింపు కార్డులను విశ్రాంత ఉపాధ్యాయులు రెయ్యి రుద్రమూర్తి బుధవారం పంపిణీ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పూర్తి వివరాలతో ఆకర్షణీయంగా ఉండాలనే ఉద్దేశంతో గుర్తింపు కార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతి, నడవడికపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికీ పాఠశాలలే దర్పణం లాంటివని, అలాంటి పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం, సామాజిక బాధ్యతగా ఆర్థికంగా, నైతికంగా స్థానికులు సహకరించాలని కోరారు. పాఠశాల సౌకర్యాల కల్పనకు తనవంతు సహకారం చేస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వై.కాంతారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని కుసుమ హేమంత్‌రావు, ఎస్ఎంసి చైర్‌పర్సన్ దున్న కవిత, గుంట కోదండరావు, కె.మాధవరావు, బి.అన్నపూర్ణ, ఎస్.పాపారావు, ఎం.హరనాథ్, ఎన్.విష్ణుమూర్తి, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్, టి.శివాజీ పాల్గొన్నారు.

## ఆత్మహత్య పరిష్కారం కాదు



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం**

ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణతో కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు, యువత ప్రత్యేకంగా సదస్సులను ఏర్పాటు చేసి వారికి అవగాహన పెంపొందించుకోవడానికి ప్రత్యేక కార్యక్రమాల రూపకల్పన అవసరమని స్టార్ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరా ప్రసాద్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. క్షణికావేశాలతో అనేకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఒక్క క్షణం నిబ్బరంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే సుదీర్ఘ జీవనాన్ని అనుభవించ వచ్చున్నారు. స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మానసిక నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యాన్ని తీసుకు రావడానికి క్లబ్ తరపున ప్రయత్నం చేస్తామన్నారు. వచ్చే వారంలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకొని అక్కడ తాము క్లాసులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, బెవర వెంకట రవిశంకర్, మహిళా వాకర్స్ అధ్యక్షులు గేదెల లక్ష్మి, స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గుడ్ల జగ్గారావు, ఎండ మోహన్, జామి రాధాకృష్ణ, పట్నాన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సహజ వనరుల దోపిడీకే 'ఆపరేషన్ కగార్'

### న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్

**ప్రజాశక్తి- పలాస**

దేశంలోని సహజ వనరులను దోపిడీ చేయడానికి, బహుళజాతి సంస్థలకు ఊడిగం చేయడానికే కేంద్రంలో మోడీ, అమిత్ షా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అంతమొందిస్తుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. మండలంలోని లొత్తూరులో పంచాయతీలోని లొత్తూరు నుంచి పెద్దగంతరు వరకూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యాన బుధవారం ర్యాలీని నిర్వహించారు. అనంతరం పెద్దగంతరులో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ దేశంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అడవులను, సహజ వనరులను, ఖనిజ సంపదను కాపాడుతున్న ఆదివాసీలను ఆపరేషన్ కగార్ పేరుతో అంతమొందిస్తున్నారని మండిపడ్డారు. మధ్య భారతంలో ఛత్తీస్గడ్ దండకారణ్యం ప్రాంతంలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన ఖనిజ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడంలో భాగమే ఆపరేషన్ కగార్‌ను ప్రచారం చేస్తున్నారని అన్నారు. మావోయిస్టులను అంతం చేస్తామనే పేరుతో ఆదివాసీలను అంతం చేస్తున్నారు. కుమారన్న, సీతారాం ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఆదివాసీల విముక్తి కోసం విప్లవోద్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షులు ఎం.లక్ష్మి, సిపిఐ ఎంఎల్ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సవళాపురం కృష్ణవేణి, ఎఐకెస్ నాయకుల గొరకల బాలకృష్ణ, సర్పంచ్ సీమను తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



క్రీడా దుస్తులతో విద్యార్థులు

**ప్రజాశక్తి- రణస్థలం**

మండలంలోని మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు బుధవారం క్రీడా దుస్తులను వితరణగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. శివశంకర్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా రాణించాలన్నారు. సర్పంచ్ అచ్చిబాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏరకమైన సహకారం కావాలన్నా అందిస్తానని, విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా రాణించాలన్నారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ రహీమ్, టి.సురేష్, కె.నాగేశ్వరరావు, బి.జి.హరనాథ్, జి.చిన్నికృష్ణం నాయుడు, పి.శ్రీదేవి, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

**కోటబొమ్మాళి:** ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దామని ఆర్‌డిఒ ఎస్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక కొత్తమ్మతల్లి కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఎటువంటి సమస్య లేకుండా చేయాలని అన్నారు. ప్రభుత్వం ఇటీవల వివిధ శాఖల ఉన్నతాధికారులకు కొత్తమ్మతల్లి జాతర విధులు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. అందుకు సంబంధిత అధికారులంతా విధినిర్వహణలో అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని అధికారులను కోరారు. అంతకుముందు ఉత్సవాలకు సంబంధించిన అన్ని ప్రదేశాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతరకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులంతా పని చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, రోడ్లు భవనాల శాఖ ఎస్‌సి బి.సత్యనారాయణ, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గాయత్రి, అర్అండ్‌బి ఎఇ హరినాథరావు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, కొత్తమ్మతల్లి ఆలయ పాలక మండలి అధ్యక్షులు కోరాడ చిన్నగోవిందరావు, ఇఒ రాధాకృష్ణ, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

## జీవన నైపుణ్యాలపై అవగాహన

**ఇచ్ఛాపురం :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇచ్ఛాపురం జెసిఐ ఆధ్వర్యాన విద్యార్థులకు కెరీర్ అండ్ లైఫ్ స్కిల్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ కెరీర్‌ను ఏ విధంగా మలచుకోవాలి, లక్ష్యాలను ఏ విధంగా చేరుకోవాలని జెసిఐ జోన్ ట్రైనర్ ఎం.సునీత వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు దుర్యోధన శివకుమార్, జెసిఐ ప్రెసిడెంట్ కాళ్ల జయదేవ్, షణ్ముఖరావు వెచ్చ వాసవి, ఎన్ఎస్ఎస్ పిఒ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

## ఉత్తమ చిత్రకారుడు 'వడ్డాది'

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

వడ్డాది పాపయ్య ఉత్తమ చిత్రకారుడని అంతర్జాతీయ వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఇందిర ప్రసాద్ అన్నారు. క్రాంతి భవన్‌లో బుధవారం వడ్డాది పాపయ్య జయంతి భారత సంస్కృతిక సహకార సేవా సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎటువంటి రంగులు లేని రోజుల్లో సహజ వనరులైన బొగ్గు, సున్నం, వివిధ ఆకుల రసాలను ఉపయోగించి చిత్రాలను వేసేవారని, అయన శ్రీకాకుళం జిల్లా వాసి కావడం మనకు గర్వకారణం అన్నారు. చందమామ, స్వాతి, నవ్య, విజయ తదితర పత్రికల ముఖచిత్రాలను ముద్రించే వారని అయన తెలిపారు. కొత్తబ్రిడ్జి రోడ్డులో పాపయ్య విగ్రహాన్ని ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎం. వి. మల్లేశ్వరరావు, వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గేదెల లక్ష్మి, రాష్ట్ర బాడీబిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ వడ్డాది విజయకుమార్, ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి జి.వి.నాగభూషణరావు, సునీత, పి. రాఘవేంద్రరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

## 70 మందికి నేత్ర వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి- పలాస**

పలాస సత్యసాయి మందిరం ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య బృందం ఆప్తమ్ వివేకవర్మ, నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ 70 మంది రోగుల నేత్రాలను పరీక్షించారు. అందులో 21 మందికంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సాయికుమార్, సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమల రావు, డోకి జగదీష్, బోయిన కామేశ్వరరావు, పొట్నూరు శ్రీనివాసరావు, పొట్నూరు కొండలరావు పాల్గొన్నారు.

## పాఠశాల సందర్శన

**మెళియాపుట్టి:** మండలంలోని మురికింటిభద్రలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమస్యలపై స్థానికుల విజ్ఞప్తి మేరకు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పాఠశాల భవనంలోని పైకప్పు నుంచి పెచ్చులూడిపోవడం, వర్షపు నీరు లోపలికి రావడంతో విద్యార్థులు తీవ్రంగా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను స్వయంగా పరిశీలించేందుకు పాఠశాలను పరిశీలించారు. పరిస్థితిని దగ్గర నుంచి పరిశీలించారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకంపై అవగాహన

**ఇచ్ఛాపురం:** మండలంలోని లొద్దపుట్టి, మండపల్లి, బిర్లంగి పంచాయతీల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ రామారావు, ఇఒ అజయ్‌కుమార్ ఎరువుల వాడకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఎకరాకు యూరియాను మూడు మోతాదులుగా వినియోగించాలన్నారు. ఒక్కో మోతాదు 25 కిలోల చొప్పున యూరియా వేయాలన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, తగినంత మోతాదులో అందుబాటులో ఉందని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే 9121863788 నంబరుకు సంప్రదించాలన్నారు.

## పాఠశాల కళావేదిక ప్రారంభం

**కంచిలి:** మండలంలోని జలంత్రకోట ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన కళ వేదిక భవనాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బుధవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు సంజయ్ పండా, తన తండ్రి కృష్ణచంద్ర పండా జ్ఞాపకార్థం సొంత నిధులతో నిర్మించిన ఈ భవనాన్ని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తుందని, దీనికి దాతల సహకారం కూడా తోడైతే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కూటమి నాయకులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, పైల పురుషోత్తంరెడ్డి, బి.కురయ్య, హెచ్ఎం ఉమాచంద్ర మహా పాత్రో, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రవికుమార్‌కు జగన్ అభినందన

**ప్రజాశక్తి- ఆమదాలవలస**



జగన్‌తో రవికుమార్

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను మాజీ సిఎం, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభినందించారు. బుధవారం విజయవాడలో జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రవికుమార్ నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలపై వివరించారు. జగన్ సంతృప్తి వ్యక్తం చేసి అభినందించినట్లు రవికుమార్ తెలిపారు. పార్టీ నాయకులు చూపుతున్న చురుకుదనాన్ని ప్రశంసించిన జగన్, అధికార పార్టీ అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజలతో కలిసికట్టుగా పనిచేస్తూ వైసిపిని మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు రవికుమార్ వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారని తెలిపారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**ఎచ్చెర్ల:** ప్రస్తుత యాంత్రిక జీవనంలో విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించే లక్ష్యంతో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) లో గురువారం యోగా నిర్వహించారు. విశ్వ విద్యాలయం యోగ విభాగం ఆధ్వర్యంలో, బాబాజీ సుష్మన్న క్రియా యోగ ఫౌండేషన్ విశాఖపట్నం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం వరకు ఉన్న విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. బాబాజీ సుష్మన్న క్రియా యోగా ఫౌండేషన్ ప్రతినిధి ఎన్. శిరీష విద్యార్థులకు ధ్యాన ప్రక్రియలో మెలకువలను నేర్పించి, వారితో ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ, పరిపాలన అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ హెచ్.ఎస్.వి.ప్రసాద్, యోగ శిక్షకులు కె.అర్చన తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

**ఎచ్చెర్ల:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారులు గంగా ప్రియదర్శిని, ఎం.ఉషశ్రీ అన్నారు. స్థానికి పిహెచ్‌సిలో బుధవారం గర్భిణీలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెల 9న నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారిని సురక్షిత ప్రసవానికి సిద్ధం చేయడానికి తగిన సూచనలు చేశారు. గర్భిణీలకు స్కానింగ్, ఉచిత రక్త పరీక్షలతో పాటు సురక్షిత ప్రసవానికి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్త హీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పౌష్టి కాహారం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆస్పత్రి సిబ్బంది, సిహెచ్ఒ రమేష్‌బాబు పాల్గొన్నారు.

## హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా నాగరాజు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం**

జిల్లా హోటల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా మెట్ట నాగరాజు ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో హోటల్స్, ఫంక్షన్ హాల్స్, స్వీట్‌షాప్‌ల యజమానులు పాల్గొన్నారు. అసోసియేషన్ హోటల్స్ నిర్వాహకులతో పాటు కళ్యాణ మండపాలు, స్వీట్‌షాపుల యాజమానులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. అధ్యక్షుడుగా మెట్ట నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కెల్ల కిషోర్ కుమార్ (చిన్ని), అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా వరద వెంకట ఆనంద్, బస్వా శ్రీనివాస రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా అందవరపు సతీష్, కోశాధికారిగా అందవరపు తిరుమలను ఎన్నుకున్నారు.

## వైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

**టెక్కలి:** టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. కిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు సాత్విక్, క్రాంతికిరణ్, శంకర్ ఫౌండేషన్ నుంచి నేత్ర వైద్యులు నిరంజన్ అపూర్వ పర్యవేక్షణలో శిబిరం కొనసాగింది. టెక్కలి, సంతబొమ్మాళి మండలాల పరిదిలో నుంచి సుమారు 200 మంది రోగులు పాల్గొనానరు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, సంఘ కార్యదర్శి కూర్మాపు ధనుంజయరావు, బొడ్డ అయ్యబాబు, రెయ్యి పున్నయ్య, దూసి ఆంధ్రాస్టాలిన్, కుప్పిలి కామేశ్వరరావు ప్రధాన హరిశ్చంద్రరావు, దల్లి వీరాస్వామిరెడ్డి, సలహదారులు జి.వి.రెడ్డి మాస్టర్ పాల్గొన్నారు.

## విద్యార్థులతోనే రాతలు

**ప్రజాశక్తి- బూర్జ**

మండలంలోని ఒవిపేట ఆదర్శ పాఠశాలలో బుధవారం గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి గ్రూపులను, హిమోగ్లోబిన్ తెలుసుకునేందుకు ఈ పరీక్షలు నిర్వహించారు. అయితే ఆస్పత్రి సిబ్బంది కాకుండా విద్యార్థులతోనే రికార్డుల్లో వివరాలను నమోదు చేయించడం, పాఠశాల సిబ్బందిగానీ, ఉపాధ్యాయ సిబ్బంది లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేటప్పుడు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగితే బాగుంటుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులతో రికార్డులు రాయిస్తున్న వైద్యసిబ్బంది

## పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**రణస్థలం:** మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలసకు చెందిన గొర్రెల కాపరి పిట్ట రమణకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం నాయకులు కోనంగి నందుడు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు ముద్దాడ రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రమణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల గుర్తు తెలియని లారీ ఢీకొని 20 గొర్రెలు మృతి చెందగా, పది గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృతి చెందడంతో బోరున రైతు విలపిస్తున్నాడని, సుమారు రూ.5 లక్షల నష్టపరిహారం వాటిల్లందన్నారు. పొట్టకూటి కోసం గొర్రెలు మేపుకుంటూ జీవనం చేస్తున్న వారికి ఈ ప్రమాదం ఆర్థికనష్టాన్ని కలిగిందన్నారు. అనంతరం తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## 29న మహాజన సభ

**పోలాకి :** ఈ నెల 29న పోలాకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో మహాజన సభ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఇఒ బంటుపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 29న ఉదయం 11 గంటలకు సొసైటీ కార్యాలయంలో చైర్మన్ భైరి భాస్కరరావు ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొవాలని కోరారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

**కొత్తూరు :** ఈ నెల 12న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ.నరసింహ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపలు చేపడుతున్నామని అన్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, కర్లెమ్మ, మహాసింగి, బడిగం, కుంటిభద్ర, సిరుసువాడ, పారపురం, గూనభద్ర, కలిగాం కాలనీ, మెట్టూరు, ఎన్.కె.పురం, ఒంద్రుజోల, లబ్బా, గుళివిందాలపేట, గొట్టిపల్లి, ఉప్పరపేట, జోగిపాడు, నేరడి, మకారిగూడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

**సోంపేట:** మండలంలోని బెంకిలి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నాడ శ్రీరామ్మూర్తి జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా ఇటీవల పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆయనను గ్రామస్తులు, పాఠశాల కమిటీ ఆధ్వర్యాన బుధవారం సన్మానించారు. దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ తామాడ కవిత, ఉప చైర్మన్ కృష్ణారావు, సచివాలయ కార్యదర్శి హరీష్, ఉపాధ్యాయుడు సతీష్, కోట రాజు, గ్రామస్తులు మడ్డు రవి, టెంక తేజేశ్వరరావు, ప్రియా వెంకటరావు, మోహనరావు పాల్గొన్నారు.

## ఆలయ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**సోంపేట :** పట్టణంలోని కోదండరామస్వామి ఆలయ ట్రస్టు కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా బీన ఆనందరావు, ఉపాధ్యక్షునిగా బెల్లాన ప్రేమకుమారి, డైరెక్టర్‌గా బెజ్జో రేవతితో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. దేవాదాయశాఖ అధికారులు, కూటమి నాయకులు మడ్డు కుమార్, చిత్రాడ శేఖర్ పాల్గొన్నారు.

## బాలికల చట్టాలపై అవగాహన

**నరసన్నపేట:** బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పిఒ శోభారాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సంకల్ప అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు అవగాహన లేని సమయంలో బాల్యవివాహాలు కూడా చేస్తున్నారని, వాటిని అరికట్టించే ప్రక్రియ అందరూపైనా ఉందని అన్నారు. ఇప్పటికే చాలాచోట్ల సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా,ఫోక్స్ చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.